క్లుప్తంగా

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

గోదావరిఖని: మద్యంతాగి వాహనాలు నడిపితే జైలుకు పంపిస్తామని తీవ్రతనుబట్టి శిక్ష పడుతుందని రామగుండం ట్రాఫిక్ సీఐ తంగెళ్ల ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సోమవా రం కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యంతాగి వాహనాలు నడిపితే జరిగే అనర్థాలు వివరించారు. కౌన్సెలింగ్ అనంతరం సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా తలా రూ.2వేల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

గోదావరిఖనిటౌన్: విజయవాడ బార్‌అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది ఆదిశేషు విఠల్ బాబు దారుణ హత్యకు నిరసనగా గోదావరిఖని బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూలై 26న న్యాయవాది ఆదిశేషు విఠల్‌బాబుని దారుణంగా హత్యచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. న్యాయవాదులపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లును ప్రవేశపెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడచక్రపాణి, ప్రధానకార్యదర్శి సమ్మయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం వాయిదా

సుల్తానాబాద్: మున్సిపల్ సమావేశం వాయిదా వేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత తెలిపారు. సోమవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించగా ఏజెండా అంశాలు చర్చించారు. కమిషనర్ లేనందున సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఆమె తెలిపారు. కమిషనర్ రాగానే సమావేశం ఏర్పాటుచేసి పలు రకాల అభివృద్ధి పనులు వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు, పలువురు పాల్గొన్నారు

ఈవీఎం, వీవీప్యాట్‌లపై గ్రామస్తులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి గ్రామాల్లో ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. ప్రజలు ఎన్నికలప్పుడు ఈవీఎం, వీవీప్యాట్‌లపై ఓటు ఎలావేయాలో తెలియజేశారు. సర్పంచ్ బొల్లపల్లి శంకర్‌గౌడ్, ఆర్ఐ సంధాని తదితరున్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని బేగంపేట, రాజాపూర్ గ్రామాలకు చెందిన డి.శిరీషకు రూ.40వేలు, కె.కుమార్‌స్వామికి రూ.16వేలు, పి.ఓంకార్‌కు రూ.16వేలు సీఎంఆర్ఎఫ్‌లో మంజూరైన చెక్కులను సోమవారం బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శెంకేషి రవీందర్, సర్పంచ్ బుర్ర పద్మ, ఎంపీటీసీ కరుణ, నాయకులు మ్యాదరవెన కుమార్‌యాదవ్, బుర్ర శంకర్, మంథని చంటి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న మహిళలు

కోల్‌సిటీ: గోదావరిఖని 38వ డివిజన్ పరిధిలోని సంజయ్‌గాంధీనగర్, వాటర్ ట్యాంక్ ఏరియా, సుందరయ్యనగర్ కాలనీలకు చెందిన మహిళలు తమ కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం రామగుండం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ముఖ్యంగా కాలనీ మధ్యలో నిలిచిన డ్రెయినేజీ పనులు, అంతర్గత రహదారులు, ఎక్కడికక్కడ నిలిచిపోతున్న డ్రెయినేజీ నీరు తదితర సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. పారండ్ల శారద, దుర్గయ్య, ఉమ, మల్లేశ్, రాజేశ్వరి, శ్రీనివాస్ తదితరులున్నారు.

హరిత మొక్కలకు రక్షణ కరువు



జూలపల్లిలో కెనాల్ వెంట హరితహారం మొక్కలు నాటుతున్న కూలీలు



పశువులు మేయడంతో కనిపిస్తున్న బెరడు

- పూర్తికావొస్తున్న 9వ విడత
- మొక్కల సంరక్షణపై అధికారులకు పట్టింపు కరువు
- పశువులు మేస్తుండడంతో కనబడకుండా పోతున్న మొక్కలు

జూలపల్లి: మండలవ్యాప్తంగా హరితహారం మొక్కలు నాటడంలో లక్ష్యం సాధించమే ధ్యేయంగా మొక్కలను నాటి వాటి సంరక్షణ మరువడంతో నాలుగు రోజుల్లోనే మొక్కలను పశువులు మేస్తుండడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ప్రతి ఏడాది మొక్కలను నాటి వాటి రక్షణ చర్యలు నామమాత్రంగానే చేపట్టడంతో అనుకున్న లక్ష్యంలో 20శాతం కూడా మొక్కలు దక్కడం లేదు. ఉపాధిహామీ పథకంలో మండలంలో 1607 కుటుంబాలు నమోదు చేసుకోగా, 7,350 జాబ్‌కార్డులు జారీచేశారు. జాబ్ కార్డుల ప్రకారం మొత్తం 15,177 మంది ఉపాధిహామీ కూలీలు ఉన్నారు. తొమ్మిదో విడత హరితహారం కోసం మండలంలోని 13 గ్రామాల్లోని పంచాయతీలకు దగ్గరగా ఉండేలా 13 గ్రామీణ నర్సరీల్లో కూలీలతో మొక్కలు పెంచుతున్నారు. ఇందులో నర్సరీకి 10వేల మొక్కల చొప్పున 1.30 లక్షల మొక్కలను పెంచారు. ఇప్పటికే 70శాతం మొక్కలు నాటడం పూర్తిచేశారు ఇంకా మిగతా మొక్కలు నాటేందుకు గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలతో ముమ్మరంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఒక్కో కూలీ రోజు 10నుంచి 15వరకు మొక్కలు నాటేందుకు రూ.272 కూలీ చెల్లిస్తున్నారు. నాటిన మొక్కల్ని కాపాడేందుకు గతంలో ముళ్లకంప, కర్రతో సహా నాటేందుకు ఈజీఎస్ ద్వారానే ఒక్కో మొక్కకు రూ.170 చెల్లించేవారు. కానీ రానురానూ కంచెలను నిలిపివేసి మొక్కలు నాటిన శివారు గ్రామ పంచాయతీలకు రక్షణ బాధ్యతలు అప్పగించారు. పంచాయతీలు గతంలో ప్లాస్టిక్ జాలీలు కొని మొక్కల సంరక్షణకు చేసిన కృషిచేసి కొంత మేర సఫలీకృతమైంది. ప్రస్తుతం మొక్కలు నాటడమే లక్ష్యం కాగా, నాటిన మొక్కలను పట్టించుకోక పోవడంతో రోడ్లవెంట ఇప్పటికే నాటిన మొక్కలను పశువులు, గొర్రెలు మేశాయి. దీంతో చెట్ల బరిగెలు కనిపిస్తున్నాయి.

కరెంటు వైర్ల కింద మొక్కలు ఖతం

రోడ్లవెంట నాటిన మొక్కలు రెండు, మూడేళ్లలోనే పెరుగుతున్నాయి. ప్రతి ఏటా వర్షాకాలం సీజన్‌లో ట్రాన్స్‌కో కరెంట్ వైర్లకు దగ్గరలో నాటిన మొక్కలు సరఫరాకు ఆటంకం కలిగిస్తాయని భావించి చెట్లను సగానికి కొట్టివేస్తున్నారు. దీంతో హరితహారంలో నాటినచెట్లు ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి దీనికి తోడు పొలాల పక్కన నాటిన మొక్కలను రైతులే తమ పొలాలకు నీడతగిలి దిగుబడులు తగ్గుతాయని తొలగిస్తున్నారు. అధికారులు అవగాహనతో మొక్కలు నాటేక్రమంలో కరెంటు వైర్లకింద కాకుండా ఎదురువైపు నాటితే చెట్లు నిలుస్తాయని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

మొక్కలు నాటుతున్నాం



రోజు ఉపాధి పనులకు పోతున్నా. నర్సరీల్లో మొక్కలు తెచ్చి సార్లుచెప్పిన దగ్గర పెడుతున్నం. రోజు కూలీ రూ.200 దాటుతలేదు. ఇంతకు ముందు చెట్లను కాపాడేందుకు ముళ్లకంప నాటే వాళ్లం ప్రస్తుతం చెట్లు మాత్రమే పెడుతున్నాం.

– వొల్లాజీ చంద్రమౌళి, ఉపాధిహామీ కూలీ, జూలపల్లి

కూలీ రూ.200 దాటుతలేదు



రోజు ఉపాధి పనికి పోతున్న నర్సరీల్లో మొక్కలు తెచ్చి 10 వరకు మేమే గుంతలు తీసి మొక్కలు నాటుతున్నాం. మొక్కలు నాటితే రూ.272 కూలీ వస్తదని సార్లు అంటున్నరు. కానీ రూ.200 దాటుతలేదు.. సారు చెప్పిన ప్రకారం వస్తే బాగుంటది.

– నోముల మల్లారెడ్డి, జూలపల్లి

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



గ్రామాల్లోని 13 నర్సరీల్లో పెంచిన మొక్కలను ఉపాధి కూలీలతో నాటిస్తున్నాం. మొక్కలను కాపాడే బాధ్యత గ్రామపంచాయతీలు తీసుకోవాలి. గ్రామస్తులు పశువుల కాపరులకు, గొర్రెల కాపరులకు అవగాహన కల్పించాలి. మొక్కలను కాపాడడంలో గ్రామస్తులు సహకరించాలి.

– సదానందం, ఈజీఎస్ ఏపీవో, జూలపల్లి

ఎన్టీపీసీ భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు భూ నిర్వాసితులకు యాజమాన్యం న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. సోమవారం ప్రాజెక్టు ఆవరణలోని ఏడీఎం బిల్డింగ్ మెయిన్ గేట్ ఏరియాలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. భవిష్యత్ ప్రణాళిక, కార్యాచరణపై అందరి అభిప్రాయాలు సేకరించి చర్చిస్తామన్నారు. భూ నిర్వాసితులు ఉద్యోగాల కోసం వేచిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో కుందారపు సత్యనారాయణ, పానుగంటి నరేందర్, సత్యనారాయణ, లక్ష్మణ్, శ్రీనివాస్, అంజయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

పీకేరామయ్య కాలనీలో పోలీసుల కార్డెన్‌సెర్చ్



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు

జ్యోతినగర్: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పీకేరామయ్య కాలనీలో సోమవారం రాత్రి పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో సంచరించిన పోలీసులు 25 వాహనాలకు పత్రాలు లేవని నిర్ధారించి వాటిని సీజ్‌చేశారు. కాలనీలోని ప్రజలను కూడలి వద్దకు పిలిచి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్రజలకు రక్షణ, నేరాల నియంత్రణ తదితర అంశాలతో పాటు కాలనీలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే వారి వివరాలు తమకు ఇవ్వాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, ప్రతీ వాహనానికి ధృవీకరణపత్రాలు తప్పనిసరిగా వెంట ఉండాలన్నారు. కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్, ఎన్టీపీసీ, రామగుండం, అంతర్గాం ఎస్సైలు జీవన్, వెంకట్, సంతోష్ ఉన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

- పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు
- గుండ్లపల్లెలో గడప గడపకూ కాంగ్రెస్



సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే

ఓదెల: రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే , టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. సోమవారం ఓదెల మండలం గుండ్లపల్లెలో గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిరంకుశపాలనను కొనసాగిస్తూ ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు తగిన గుణపాఠం తప్పదన్నారు సహజ వనరులను బీఆర్ఎస్ నాయకులు దోచుకొని కోట్లాది రూపాయలు దండుకున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు పుప్పాల శంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్ రెడ్డి, నాయకులు మినుపాల ప్రకాశ్‌రావు, అంతటి అన్నయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సివిల్‌రైట్స్‌డే

- అంటరానితనం అమానుషం
- ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి
- అందరూ కలిసిమెలిసి జీవించాలి



సుల్తాన్‌పూర్‌లో సివిల్‌రైట్స్‌డే

ఎలిగేడు/జూలపల్లి/కమాన్‌పూర్/ఓదెల: పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గాల్లో సోమవారం సివిల్‌రైట్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలిగేడు మండలంలోని శివుపల్లి ఎస్సీకాలనీలో, జూలపల్లి మండలంలోని అబ్బాపూర్ ఎస్సీ కాలనీలో, రామగిరి మండలంలోని బేగంపేట ఎస్సీ కాలనీలో, ఓదెల మండలంలోని నాంసానిపల్లెలో అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై గ్రామస్తులతో కలిసి మాట్లాడారు. వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. ప్రభుత్వపథకాలు, ఎస్సీకాలనీల అభివృద్ధి తదితర అంశాలపై వివరిచారు. గ్రామాల్లో కులవివక్ష పాటిస్తే కఠిన చర్యలు ఉంటాయని, ప్రజలంతా తమ బాధ్యతలు తెలుసుకోవాలని సూచించారు. మూఢనమ్మకాలు, అంటరాని తనం ప్రోత్సహించే వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జూలపల్లి తహసీల్దార్ అబూబాకర్ హెచ్చరించారు.

ఏసీపీని కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్



యైటింక్లయిన్‌కాలనీ: నూతనంగా గోదావరిఖని ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన తుల శ్రీనివాస్‌రావును సోమవారం కమాన్‌పూర్ మార్కెట్‌కమిటీ చైర్మన్ దాసరి రాజలింగు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనవెంట బీఆర్ఎస్ నాయకులు అంబటి సంతోష్‌రావు ఉన్నారు.

కంటి శస్త్రచికిత్సలకు తరలింపు

మంథని: మండలంలోని పలు గ్రామాల నుంచి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 35 మందిని ఉచిత కంటి శస్త్రచికిత్సలకు సోమవారం కరీంనగర్‌లో రేకుర్తి కంటి ఆస్పత్రికి తరలించారు. వీరికి ఉచిత రవాణా, భోజన వసతి కల్పించారు. లయన్స్ క్లబ్ ఐ ఆక్టీవీటీస్ చైర్మన్ పూదరి దత్తగౌడ్, మంథని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మేడగోని వెంకటేశ్, ఉపాధ్యక్షుడు తూము రవీందర్, ఆప్తమాలజిస్ట్ లయన్ బుద్దార్తి సతీశ్‌కుమార్, హెచ్‌డీఎఫ్‌సీ బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, గౌస్ హుస్సేన్, శంషీర్, రంజిత్‌కుమార్ ఉన్నారు.

ఎల్వోసీ అందజేత

ధర్మారం: మండలంలోని ఖిలావనపర్తికి చెందిన లక్ష్మి అనారోగ్యానికి గురికాగా మెరుగైన వైద్యం కోసం రూ.లక్ష ఎల్వోసీని సోమవారం మంత్రి కొప్పుల ఈశ్వర్ హైదరాబాద్ క్యాంపు కార్యాయలంలో బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. లక్ష్మికి వైద్యం చేయించుకుని స్తోమత లేక మంత్రిని కలువగా ప్రభుత్వం నుంచి రూ.లక్ష ఎల్వోసీ మంజూరు పత్రాన్ని బాధిత కుటుంబానికి అందించారు.

మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్టిస్టులను హేళన చేస్తూ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ మాట్లాడిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పెద్దపల్లి జిల్లా ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈదునూరి తిరుపతి అన్నారు. కళాకారులను గోడల మీద రాతలు రాసుకునే వాళ్లు అని హేళనచేస్తూ విలువ లేకుండా మాట్లాడినందుకు రాష్ట్రంలోని ఆర్టిస్టులందరికీ మంత్రి భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్టిస్టులు మూకిరి రాజు, మోహన్, దేవా, రాజలింగు, వంశీ, రవీందర్, సుధాకర్, రాఖీ, వరప్రసాద్, తాజోద్దీన్ లు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



నీటి గుంతల్లో బ్లీచింగ్‌పౌడర్ చల్లిస్తున్న వైద్యాధికారి

ధర్మారం: ప్రతీ ఒక్కరు ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలనా వైద్యాధికారి అనుదీప్ సూచించారు. ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లిలో సోమవారం వైద్యాధికారి అనుదీప్ ఆధ్వర్యంలో వైద్యబృందం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటి పరిసరాల్లో అపరిశుభ్రంగా ఉండకుండా చర్యలు తీసుకున్నారు. నీటి గుంటల్లో బ్లీచింగ్‌పౌడర్ చల్లించారు. దోమల నివారణకు చర్యలు తీసుకున్నారు. వైద్యాధికారి మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలు శుభ్రం చేసుకోవాలని అపరిశుభ్రంగా ఉంటే దోమలు విజృంభిస్తాయన్నారు. గ్రామంలో ఎవరైనా జ్వరపీడితులుంటే సమాచారం అందించి వైద్యం చేయించుకోవాలన్నారు. వైద్యసేవలందించేందుకు అందుబాటులో ఉంటామని ప్రజలకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది అట్ల దామోదర్‌రెడ్డి, ఎఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

డివిజన్ సమస్యలు పరిష్కరించాలని వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న జ్యోతి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండంలోని 39వ డివిజన్‌లో సమస్యలు పరిష్కరించడంతో కార్పొరేషన్ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి కార్పొరేటర్ జెట్టి జ్యోతి హాజరై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు వినతిపత్రం అందించారు. డివిజన్‌లో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎన్టీపీసీ రామగుండం టౌన్‌షిప్ రింగ్‌రోడ్ నుంచి ఆర్ఎఫ్‌సీఎల్ రైల్వేగేట్ గౌతమినగర్ సెంటర్ వరకు వీధిదీపాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభావిత ప్రాంతమైన ఖాజిపల్లికి పూర్తిస్థాయి మౌళిక సదుపాయాలు కల్పించడంలో ఎన్టీపీసీ యాజమాన్యం సహకరించడం లేదన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ శ్రేణులు

కాల్వశ్రీరాంపూర్/ఓదెల/ఎలిగేడు: బీజేపీ పిలుపుతో స్థానిక సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరుసంపత్ కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ సుధాకర్‌కు, పెద్దపల్లిలో ఆర్టీసీ బస్‌డిపోను ఏర్పాటుచేయాలని, అర్హులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు, తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలని బీజేపీ ఓదెల మండల అధ్యక్షుడు కారెంగల శ్రీనివాస్ ఓదెల తహసీల్దార్‌కు ఎలిగేడు మండలకేంద్రంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలని తహసీల్దార్ నాగరాజమ్మకు బీజేపీ నాయకులు వినతిపత్రాలు అందించారు. ఇటీవల వరదలకు పొలాల్లో ఇసుక మేటలు వేశాయని నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 30 వేలు పరిహారం అందించాలని, వర్షాలకు దెబ్బతిన్న రహదారులు, కల్వర్టులు మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని, వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్ మంజూరు చేయాలని, వర్షాలకు దెబ్బతిన్న విద్యుత్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టాలని, సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యాక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోదాటి వెంకటరమణారావు, నాయకులు కొక్కిరాల దామోదర్‌రావు, చౌదరి తిరుపతి యాదవ్, మ్యాదరవేని రాకేశ్‌యాదవ్, ర్యాకం మహేందర్, తీర్థాల కుమార్, మార్క శ్రీనివాస్‌గౌడ్, సకినాల కృష్ణ, ఎంబాడి మల్లేశ్, రామినేని శివ, జంగం అజయ్, మాటూరి మహేశ్, కల్వల శ్రీనివాస్, అంతగిరి సమ్మయ్య, తోట శ్రీధర్, తాత రాజు, దాసరి కృష్ణ, కొత్తగట్టు నాగరాజు, బాలసాని వెంకటేశ్, గోపగాని రమేశ్, జీడి నరేశ్, పిల్లమర్రి రాములు, మేకల కుమార్ పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: సీపీఎస్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ విధానం కొనసాగించాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు కోరారు. సోమవారం ఆర్డీవో మధుమోహన్‌కు వినతి పత్రం అందించారు. పెండింగ్ బిల్లులు మంజూరుచేయాలని కోరారు. ఉపాధ్యాయుల ప్రమోషన్ చేపట్టాలని, సర్వీస్‌పర్సన్‌ను నియమించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. నాయకులు విజేందర్‌రెడ్డి, ఉమాపతిరెడ్డి, వెంకటేశ్వర్లు, అనిల్‌ప్రసాద్, చంద్రశేఖర్ తదితరులున్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామగిరి మండలం చందనాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం స్కూల్‌బ్యాగ్స్ అందించారు. వీఎస్ఏ డెవలపర్స్ బల్మూరి సుమన్, అంజనీపుత్ర ఎస్టేట్ వారి సహకారంతో 300 మంది విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్స్ పంపిణీచేశారు. వీఎస్ఏ డెవలపర్స్ టీం ఎండీ. వసీం, అజయ్‌కుమార్, ఎండీ.తస్వీజ్, సాయికిరణ్, ఆర్ష ఫౌండేషన్ ఫౌండర్ హర్ష బూడిద, వెంకటేశ్, వరుణ్, రవితేజ, మంజు అభయ్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.వెయ్యి కోట్లతో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కాల్వశ్రీరాంపూర్: నిరుపేద ఆర్యవైశ్యుల సంక్షేమానికి రూ.వెయ్యి కోట్లతో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు రాఘవులు, అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్యవైశ్య సంఘం కరీంనగర్‌లో చేపట్టిన నిరసన దీక్షలో పాల్గొనేందుకు కాల్వశ్రీరాంపూర్ మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలివెల్లారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల సమ్మె

ఎలిగేడు: మండలకేంద్రంలో జీపీ ఉద్యోగ, కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం 26వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరిచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీపీ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల లచ్చయ్య, కార్యదర్శి ఎండీ.ఖాజ, కవ్వంపల్లి దేవయ్య, మండల అధ్యక్షుడు తీట్ల శ్రీనివాస్, పారిశుధ్యకార్మికులు ఆసంపల్లి చంద్రయ్య, సరీన్, కొండయ్య, మొగిలి, నర్సయ్య, సత్యనారాయణ, కోండ్ర నర్సయ్య, చిరంజీవి, కార్మికులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు తరలివెళ్లిన జీపీ కార్మికులు

కాల్వశ్రీరాంపూర్: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సోమవారం జీపీ కార్మికులు కలెక్టర్ కార్యాలయానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు కలవేన గట్టయ్య, నాయకులు రాజబాబు, సంపత్, సురేశ్, అంజయ్య, రామస్వామి, మధునయ్య, అనసూర్య, ఓదెమ్మ, లక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో పోటీల్లో ఎన్టీపీసీ విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

జ్యోతినగర్: హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో సెల్యూట్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్–2023 టోర్నీలో ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభకనబర్చి పలు పతకాలు సాధించారు. కటాస్ విభాగంలో కార్తికేయన్, ముక్తిశ్రీ, హార్దిక్, గాయత్రి, శ్రీహిత్, ప్రణతి, కుముటి విభాగంలో ముక్తిశ్రీ, హేమలత, విబోర్ కౌశిక్, శ్రీహిత్, ప్రణతి, గాయత్రి, సాయిదివ్య, సునేహా, రాఖీ, దేవేంద్ర, అమృత, నిదేష్‌కుమార్ పతకాలు సాధించారు.కోచ్ కరాటే శ్రీనివాస్‌ను జపాన్ శిటార్యు కరాటే స్కూల్ ప్రెసిడెంట్ ఎం.రమేశ్, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, సంజన, అభిజ్ఞ పటేల్‌తో పాటు ఎన్టీపీసీ రామగుండం స్పోర్ట్స్‌కౌన్సిల్ సెక్రటరీ బాణేష్ రావు స్పందన క్లబ్ సెక్రటరీ త్రివేది, చిరంజీవి ఆదిత్య, వంశీకృష్ణ తల్లిదండ్రులు అభినందించారు.

విద్యార్థికి ఆర్థికసాయం అందజేత

కమాన్‌పూర్: మండలకేంద్రానికి చెందిన పరికిల్ల అంజలికి అక్షరస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రూ.7,500లు ఆర్థికసాయం అందించారు. అంజలి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించగా నిరుపేద కుటుంబానికి చెందిన అంజలికి ఫౌండేషన్ తరపున ఆర్థికసాయం అందించినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. ఎంఈవో సంపత్‌రావు, శంకర్, వెంకటరెడ్డి, రమేశ్, సుధాకర్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.